సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 29 । మార్చి । 2024



అప్పు తీర్చమన్నందుకు హత్య

నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామంలో ఇటీవల మహిళ హత్యకు గురికాగా.. కేసు మిస్టరీ వీడింది.
- 10లో



వనరులపై దృష్టి సారించాలి

ఇంధన వనరులపై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ వీసీ వీసీ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.
- 12లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సా॥)

సహర్ 4-50 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

అర్వపల్లి: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. అర్వపల్లిలోని కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట డీఏఓ శ్రీధర్‌రెడ్డి, ఎంఈఓ బాలునాయక్, సీఎస్‌లు, డీఓలు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు



మాట్లాడుతున్న శిరీష

మునగాల: మునగాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కలెక్టర్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. బోర్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై వివరించారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, ఎంపీఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ గొప్ప త్యాగశీలి



నోటు పుస్తకాలు అందజేస్తున్న హస్సేన్

సూర్యాపేటటౌన్: మహిళా సాధికారత కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి అంబేడ్కర్ అని, మహిళలు చదువుతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి, సంఘమిత్ర ఎడ్యుకేషనల్, చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్ అన్నారు. వచ్చే నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో జ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వసంత సత్యనారాయణ పిళ్లై, గాదె రమాదేవి, ప్రిన్సిపాల్ సునీల, ప్రవళిక, దీపిక, అఖిల్ పాల్గొన్నారు.

ఆకతాయిలు ఇబ్బంది పెడితే 100కు కాల్ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఐటీ సెల్ సీఐ

హుజూర్‌నగర్ : విద్యార్థినులను ఆకతాయిలు ఇబ్బంది పెడితే 100కు డయల్ చేయాలని జిల్లా ఐటీ సెల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ముత్తయ్య అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు పంపించొద్దన్నారు. ఎవరైనా తొందరపడి డబ్బులు పంపితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలపాలని, దీంతో ఆ అమౌంట్ ఫ్రీజ్ అవుతుందని చెప్పారు. అదే విధంగా సైబర్ క్రైమ్స్, రోడ్ భద్రత, మహిళలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్, ఏఎస్ఐ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి



సుదర్శన్ రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది నూకల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రత్యర్థిపై 24 ఓట్ల తేడాతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా డపుకు మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఎంఎస్ వరప్రసాద్, జాయింట్ సెక్రటరీగా పెండెం వాణి, కోశాధికారిగా ధరావతు వీరేష్ నాయక్, లైబ్రరీ సెక్రటరీగా ఎండీ అబ్దుల్ లతీఫ్, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జిలకర చంద్రమౌళి, ఈసీ సభ్యులుగా సుంకర్ రవికుమార్, డి.వెంకట్ రెడ్డి, కోరిపెల్లి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ప్రైవేట్ పైనే ధ్యాస..!

ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉండని డాక్టర్లు

- అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



సూర్యాపేట పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన రాజేశ్వరి ఇటీవల తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఓపీ రాయించుకుని సంబంధిత వైద్యుడి గదికి వెళ్లింది. అయితే అక్కడ సీనియర్ వైద్యుడు లేడు. ఆయన స్థానంలో ముగ్గురు జూనియర్ వైద్యులు ఉన్నారు. చేసేదేమీ లేక వారికే చూపించుకుని మందులు తీసుకుని ఇంటికెళ్లింది. వైద్యులకు సొంత క్లినిక్‌లు ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రులకు సమయానికి రావడం లేదు. ఇది ఒక్క జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనే కాదు.. పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో కూడా వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలు, మున్సిపల్ కేంద్రాల్లో ఉన్న ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో నిరుపేదలకు వైద్యసేవలు అందని ద్రాక్షలా మారాయి. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే ప్రతి వైద్యుడికి ఒక ప్రైవేట్ క్లినిక్ లేదా కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుండడంతో వాటిపైనే ధ్యాస ఉంచుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో విధులకు సక్రమంగా రావడం లేదు. ప్రభుత్వాస్పత్రిలో వేతనం పొందుతూ ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్‌లో పనిచేస్తూ ప్రజలను పట్టించుకోకపోవడమేంటని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇష్టానుసారంగా విధులకు..

జిల్లాలో 23 పీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆస్పత్రి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జనరల్ ఆస్పత్రి ఉంది. వైద్యులు విధులకు సమయానుకూలంగా హాజరుకాకపోగా.. అత్యవసర సమయంలో కూడా ఆస్పత్రికి రాలేని పరిస్థితి నెలకొంది. డాక్టర్లు ఉన్నా వైద్యం అందకపోవడంతో ప్రమాదాల్లో గాయపడిన రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో లేకపోవడంతో వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ వేతనం పొందుతున్నా, ప్రైవేట్‌లో అడ్డగోలు సంపాదన ఉండడంతో విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు పకడ్బందీగా అమలైతేనే ప్రభుత్వ వైద్యుల్లో మార్పు వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జూనియర్లతోనే ఓపీ..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోజు సుమారుగా 400 మంది నుంచి, 760 మందికి పైగా ఓపీ చూస్తుంటారు. జనరల్ ఆస్పత్రిలో సీనియర్ వైద్యులు సుమారు 82 మంది, జూనియర్ వైద్యులు 100 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే సీనియర్ వైద్యులు ఓపీ సేవలు అందించడం లేదు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు వైద్యులు సేవలు అందించాల్సి ఉంది. కొందరు 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం 12 గంటల తర్వాతే వెళ్లిపోతుండడంతో నిరుపేద రోగుల నాడీ పట్టేవారే కరువయ్యారు. హౌజ్ సర్జన్‌లు, జూనియర్ వైద్యులతోనే ఓపీ సేవలు అందిస్తున్నారు. రోగం ఒకటైతే మందు మరొకటి అన్నట్లు జూనియర్ వైద్యుల చికిత్సతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎక్కువ సమయం ప్రైవేట్‌లోనే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల్లో మెజారిటీ డాక్టర్లు ప్రైవేట్‌గా వైద్యం చేస్తున్నారు. కొంతమందికి సొంత ఆస్పత్రులు ఉండగా, మరికొందరు ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తూ ప్రభుత్వ వైద్యాన్ని విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైద్యులకు సీనియారిటీ పెరుగుతున్నా కొంత మంది విధులకు డుమ్మాలు కొట్టడం ఎక్కువవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఒక్క వైద్యుడు కూడా సమయానికి విధులకు వచ్చిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. ప్రైవేట్‌లో పనిలేకుంటేనే టైంపాస్‌కు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నారని ఆస్పత్రి సిబ్బందే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

- వచ్చేనెల 1వ తేదీ నుంచి అందుబాటులో కొనుగోలు కేంద్రాలు
- కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కొనుగోలు కేంద్రాల ద్వారా నిర్వహించే యాసంగి ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై గురువారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులు, పీఏసీఎస్ చైర్మన్లు, సీఈఓలు, ఐకేపీ అధికారులు, సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. వీటిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 63 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 158, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించకూడదని, అధికారులు ప్రారంభించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లత, డీఎస్ఓ మోహన్ బాబు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీసీఓ పద్మ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డీఓలు సూర్యనారాయణ, వేణుమాధవ్, డీఎంఓ శర్మ, ఆర్‌టీఓ సురేష్ రెడ్డి, డీఎస్ఓ మోహన్‌బాబు, డీఎం రాములు, పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రచారంపై నిఘా

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలో సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వార్తలపై నిఘా పెంచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లతతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఆర్ఓ రమేష్ కుమార్, డీఈ మల్లేశం, ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

గరిడేపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటరావు సూచించారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మౌలానా ఉన్నారు.

కుష్టు అనుమానితులు 1,055 మంది

- సర్వేలో గుర్తించిన వైద్యారోగ్యశాఖ
- జిల్లాలో ఇప్పటికే 56 మంది బాధితులు
- గతనెలలో ముగిసిన కుష్టు అవగాహన పక్షోత్సవాలు



మచ్చలు ఉన్న వారిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): జిల్లాలో కుష్టు వ్యాధి చాప కింది నీరులా విస్తరిస్తోంది. ఈ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించడానికి జనవరి 31 నుంచి ఫిబ్రవరి13 వరకు కుష్టు అవగాహన పక్షోత్సవాలు కొనసాగాయి. ఇందులో భాగంగా అనుమానితుల కోసం జిల్లాలోని 23 మండలాల్లో ఈనెల 11 నుంచి 24 వరకు వైద్యారోగ్యశాఖ సర్వే చేపట్టింది. జిల్లాలో 3,49,273 నివాసాల్లో 10,37,092 మందికి పరీక్షలు నిర్వహించగా 1,055 మంది అనుమానితులను వైద్యశాఖ సిబ్బంది గుర్తించారు. దీనితోపాటు వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించే లక్ష్యంతో పోస్టర్లు, సిబ్బంది ద్వారా ఊరూరా అవగాహన కల్పించారు.

అనుమానితులు ఎవరంటే..

సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి బాధితులను వైద్యశాఖ ఇప్పటికే గుర్తించింది. ముఖ్యంగా మొద్దుబారిన మచ్చలు ఉన్నాయా? కాళ్లు, చేతులు తిమ్మిర్లు ఉన్నాయా.. శరీరంపై ఎక్కడైనా తెల్ల, గోధుమ రంగు మచ్చలు మెరుస్తూ నున్నగా ఉన్న వారిని అనుమానితులుగా గుర్తించారు. ఆ వివరాల జాబితాను జిల్లా కార్యాలయంలో అందజేశారు. ఈ జాబితా ఆధారంగా వైద్య సిబ్బంది అనుమానితుల ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలతో పాటు మచ్చ ప్రాంతం ఉన్న ప్రాంతం నుంచి కొన్ని నమూనాలను సేకరించి ల్యాబ్‌లో నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. వచ్చేనెల 2 వరకు ఇలా అనుమానితుల నుంచి నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స ప్రారంభిస్తారు.

చికిత్స చేయించుకుంటే ఇబ్బంది ఉండదు



కుష్టువ్యాధి నివారించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాం. 1,055 మందిని అనుమానితులుగా గుర్తించాం. ప్రస్తుతం అనుమానితుల జాబితాను తయారు చేశాం. సకాలంలో చికిత్స తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– కోటాచలం, జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట

జిల్లాలో బాధితులు ఇలా..

జిల్లాలో ఇప్పటికే 56 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉండగా ప్రస్తుతం ఇంటింటి సర్వేలో 1,055 మంది అనుమానితులను గుర్తించారు. పరీక్షల అనంతరం వ్యాధి నిర్ధారణ కోసం అవసరమైన మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందించనున్నారు. ఈ వ్యాధి లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల ముందుగా చర్మం, నరాలకు సోకుతుంది. నెమ్మదిగా వ్యాపించి వ్యాధి లక్షణాలు బయట పడేందుకు కనీసం మూడేళ్ల పడుతుంది. వ్యాధిగ్రస్తుడు ఆందోళన చెందకుండా చికిత్స పొందితే పూర్తిగా నయమవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎవరికైనా కుష్టు వ్యాధిగా అనుమానం ఉన్నట్లయితే ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు అందించి వ్యాధి నయం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

‘తొలిమెట్టు’ నిధులు విడుదల

- ఒక్కో ఎంఎన్‌ఓకు రూ.6వేల చొప్పున జిల్లాకు రూ.1.38లక్షలు విడుదల
- టూర్ డైరీ వివరాలు అందించాక జమ కానున్న రవాణా భత్యం



సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న ఎంఎన్ఓ యల్లయ్య (ఫైల్)

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి తొలిమెట్టు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. దీనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలంలో సీనియర్ హెచ్ఎంలను మండల నోడల్ అధికారులుగా (ఎంఎన్ఓ) నియమించింది. వీరు ప్రతినెలా కాంప్లెక్స్‌ల వారీగా పాఠశాలలను సందర్శించి తొలిమెట్టు కార్యక్రమ అమలును తనిఖీ చేయాలి. అలాగే తొలిమెట్టు అమలులో భాగంగా ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. విద్యార్థుల సామర్థ్యాలను కూడా తనిఖీ చేసి వివరాలను అక్కడి నుంచే యాప్‌లో నమోదు చేయాలి. ప్రతినెలా పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించాలి. మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించాలన్న నిబంధనలు ఉండటంతో వారికి రవాణా భత్యం చెల్లించేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు ఎంఎన్ఓలకు 2023–24 విద్యా సంవత్సరానికి రవాణా భత్యం గ్రాంట్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో 23 మంది ఎంఎన్ఓలు

జిల్లాలో 23 మండలాలు ఉండగా మండలానికి ఒక ఎంఎన్ఓ చొప్పున 23 మంది మండల నోడల్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ. 600 చొప్పున జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.6 వేలు మంజూరు చేశారు. మొత్తంగా జిల్లాకు రూ.1,38,000 మంజూరయ్యాయి. ఎంఎన్ఓలు టూర్ డైరీ (వర్క్ డన్ స్టేట్‌మెంట్) పాఠశాలల వారీగా వివరాలను జిల్లా అధికారులకు అందజేశాక రవాణా భత్యం వారి ఖాతాల్లో జమ కానుంది. కాగా.. ఇప్పటి వరకు ఎంఎన్ఓలు తమ సొంత ఖర్చు పెట్టుకుని పాఠశాలలను తనిఖీ చేశారు.

రవాణా భత్యం పెంచాలి



తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను తనిఖీ చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఎంతో పకడ్బందీగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నాం. ప్రస్తుతం చెల్లించే రవాణా భత్యం వాహన పెట్రోల్ ఖర్చులకు కూడా చాలడం లేదు. పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు తమకు అయ్యే ఖర్చుల్లో సగం కూడా చెల్లించడం లేదు. రవాణా భత్యాన్ని పెంచాలి.

– యల్లయ్య, ఎంఎన్ఓ, జాజిరెడ్డిగూడెం మండలం, పీఆర్‌టీయూ బాధ్యుడు

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి, ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

యాసంగి పంటకు ఇదే చివరి తడి

అర్వపల్లి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) రెండో దశ ఆయకట్టుకు ప్రస్తుత నీటి విడుదల ఇదే చివరి తడి కానుంది. ఈమేరకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ఈసారి తొందరగా నీటిని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాగా.. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఈ ఏడాది జనవరి 8న మొదటి తడిగా నీటిని విడుదల చేయగా.. ఈ సీజన్‌లో మొత్తం ఆరు తడులలో (ఆరు విడతలు) నీటిని విడుదల చేస్తామని షెడ్యూల్‌లో ప్రకటించారు. ఆ విధంగానే జనవరి 8 నుంచి 15 వరకు మొదటి విడత, 23 నుంచి 30 వరకు రెండో విడత, ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు మూడో విడత, ఫిబ్రవరి 22 నుంచి 29 వరకు నాల్గవ విడత, ఈ నెల 8 నుంచి 15 వరకు 5వ విడత, చివరి విడతగా ఈనెల 23 నుంచి 30 వరకు విడుదల చేస్తామని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ నెల 30తో నీటిని నిలిపివేస్తామని అధికారులు ప్రకటించారు. కాగా షెడ్యూల్ ప్రకారం నీటిని ఈసారి విడుదల చేయడం లేదు. షెడ్యూల్ ప్రకారం కాకుండా కొద్ది రోజులు తగ్గించారు. అలాగే నీటిని కూడా తక్కువగా ఇవ్వడంతో చివరి భూములకు నీళ్లు చేరని పరిస్థితి ఏర్పడింది. దీంతో వరి పంటలు ఎండిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లో ఈ సీజన్‌లో సుమారు 1.50 లక్షల ఎకరాల భూమి రెండో దశ పరిధిలో రైతులు సాగు చేశారు. మరో 10 రోజుల పాటు పంటలకు గోదావరి జలాలను పెంచాలని రైతులు కోరుతున్నారు.

ఒక్క మొక్క బతికితే ఒట్టు!

- కోదాడ పట్టణ ప్రకృతి వనాల్లో కనిపించని పచ్చదనం
- ఏడేళ్లలో రూ.17 కోట్లు ఖర్చు చేసిన మున్సిపల్ యంత్రాంగం
- మొక్కల సంరక్షణకు 50 మంది సిబ్బంది నియామకం
- నెలకు రూ.6లక్షలు వేతనాలకే చెల్లిస్తున్న వైనం



కోదాడ 30వ వార్డు కట్టకొమ్ముగూడెం రోడ్డులోని పట్టణ ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

కోదాడ: కోదాడను హరితమయంగా మారుస్తామని మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డుల్లో కోట్లాది రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాల్లో రెండు, మూడు మినహా మిగతా వాటిల్లో ఒక్కటంటే ఒక్క మొక్క కూడా బతకలేదు. ఇదిలా ఉండగా.. ఈమొక్కల సంరక్షణకు పాలకులు గతేడాది తాత్కాలిక పద్ధతిన సిబ్బందిని నియమించుకొని వారికి రూ.లక్షల్లో వేతనాలు చెల్లిస్తుండడం గమనార్హం.

రూ.17 కోట్లు ఖర్చు చేసినా..

ప్రభుత్వం 2017లో హరితహారం కార్యక్రమం చేపట్టిన తరువాత గడిచిన ఏడేళ్లలో కోదాడ మున్సిపాలిటీ ఇందుకు రూ.17 కోట్లు ఖర్చు చేసింది. మొక్కల కొనుగోలు, వాటికి ట్రీ గార్డుల ఏర్పాటు, మొక్కలకు నీరు పోసే కాంట్రాక్టులు అన్ని పాలకుల కనుసన్నల్లో జరిగాయి. దీనికి ప్రత్యేకంగా ఆడిట్ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటా లక్షల మొక్కలు నాటుతూ వచ్చారు. ఏడేళ్ల పూర్తయిన తరువాత పట్టణంలో అసలు ఎన్ని మొక్కలు నాటారు.. వాటిలో ఎన్ని బతికాయి అంటే సమాధానం చెప్పేవారు కరువయ్యారు. ఏ వార్డులో చూసినా పట్టుమని పది మొక్కలు కూడా కనిపించడం లేదని ఆయా వార్డుల ప్రజలు పేర్కొంటున్నారు.


ఒక్కో వార్డులో ఇలా..

గతేడాది కోదాడ మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో 35 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వార్డుల్లో లేఅవుట్ కింద మున్సిపాలిటీకి వచ్చిన స్థలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పట్టణ ప్రకృతి వనం కోసం రూ.5లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ నిధులతో ప్రతి పట్టణ ప్రకృతి వనానికి చుట్టూ ఫెన్సింగ్, దానిలో బోరు మోటారు ఏర్పాటు చేయడంతో పాటు పెద్దగేటు, మొక్కలకు నీరు పెట్టడానికి పైప్‌లైన్ వేశారు. వాటిల్లో రూ.లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటారు. ప్రతి దానికి ఒక్క వార్డు ఆఫీసర్‌ను నియమించి మొక్కల సంరక్షణ బాధ్యత వారికి అప్పగించారు. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో 35 పట్టణ ప్రకృతి వనాల్లో రెండు మూడు మినహా అన్నింట్లో మొక్కలన్నీ చనిపోయాయి. వాటిలో ఉన్న మోటార్లు ఉన్నాయో లేవో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. కొన్ని పట్టణ ప్రకృతి వనాలకు చెందిన స్థలాలను కొందరు కబ్జా కూడా చేస్తున్నారు.

50 మంది సిబ్బందితో ఏం పనిచేస్తున్నారో?

కోదాడ మున్సిపాలిటీలో హరితహారం కింద నాటిన మొక్కలకు పాదులు చేయడం, మొక్కలను కత్తిరించడం వంటి పనుల కోసం గతేడాది తాత్కాలిక పద్ధతిన 50 మంది సిబ్బందిని నియమించారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.12 వేల వేతనం చెల్లిస్తున్నారు. హరితహారం కింద నాటిన మొక్కలు ఎక్కడ బతికిన దాఖలాలు లేవు. అలాంటిది నెలకు రూ.6లక్షల వేతనాలు చెల్లిస్తూ వీరిచేత ఏం పని చేయిస్తున్నారో అర్థం కావడంలేదు. ఇదిలా ఉంటే మొక్కల సంరక్షణ సిబ్బందిగా నియమించిన వారు కొందరు నాయకులు, అధికారులకు భారీ మొత్తంలో చెల్లించి ఈ ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయిస్తాం



గత ప్రభుత్వ హయాంలో కోదాడ మున్సిపాలిటీలో అనేక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ మున్సిపాలిటీలో జరుగుతున్న అన్ని వ్యవహారాలపై త్వరలోనే సమీక్ష నిర్వహించి పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయిస్తాం. అధికారులే జవాబుదారీగా ఉండాలి.

– నలమాద పద్మావతి, కోదాడ ఎమ్మెల్యే

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నార్కట్‌పల్లి : మండలంలోని రైల్వే లైన్ పరిధిలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని నల్లగొండ రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి పరిధిలోని ×52ౡ5–6 రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి మృతి చెందిన గుర్తు తెలియని సుమారుగా 70ఎళ్ల వయస్సు ఉన్న మృతదేహాంను సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు మృతదేహాం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మెరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అల్లుడిని హత్యచేసిన మామ రిమాండ్

చింతపల్లి : అల్లుడిని బండరాయితో కొట్టి హత్య చేసిన మామను గురువారం చింతపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటంపేట గ్రామానికి చెందిన ఆలకుంట్ల రాజు(38) బండరాళ్లు కొట్టి గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. మామ అల్లుండ్లు బండల విషయంలో ఈనెల 23న తగాదా పడ్డారు. దీంతో వారు పెద్ద మనుషుల సమక్షంలో గ్రామంలో అదే రోజున రాత్రి మాట్లాడుకుంటుండగా ఒక్క సారిగా మామ సంపంగి ఎల్లయ్య అల్లుడు రాజుపై కట్టెతో దాడి చేశాడు. ఈ దాడిలో అల్లుడు రాజు తీవ్ర గాయం కావడంతో స్పృహకోల్పోయాడు. అదే విధంగా మామ పక్కనే ఉన్న బండరాయిని రాజు కాళ్లపై వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎల్లయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. గురువారం మండలంలోని వెంకటంపేట వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఎల్లయ్యను మండల పోలీసులు పట్టుకున్నారు. అతడిని దేవరకొండ జడ్జి ఎదుట హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించి సిబ్బంది యాదయ్యను అభినందించారు.

మద్యం దుకాణంలో నగదు చోరీ



సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి ఫొటో

మునగాల : ఓ మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు నగదును చోరీ చేశారు. ఈ ఘటన గురువారం మండలంలోని బరాఖత్ గూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని బరాఖత్‌గూడెంలో బుధవారం రాత్రి లక్ష్మి గణపతి వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.75వేల నగదును చోరీ చేశారు. రాత్రి సిబ్బంది దుకాణానికి తాళం ఇంటికి వెళ్లి గురువారం ఉదయం వచ్చి తాళం తీసి చూడగా నగదు ఉంచిన కౌంటర్ తెరిచిఉండడంతో అందులో పరిశీలించగా రూ.75వేలు చోరీ అయినట్లు గుర్తించారు. దుకాణం పైకప్పు రేకులను తొలగించి లోపలకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. దీంతో సిబ్బంది స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భువనగిరి ఎంపీ అభ్యర్థి చామలకు ఘన స్వాగతం

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా ఢిల్లీ నుంచి వచ్చిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి నాయకులు, అభిమానులు హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో గురువారం ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రెండు రోజుల క్రితం ప్రకటించిన తెలంగాణలోని నాలుగు ఎంపీ స్థానాల్లో భువనగిరి స్థానం నుంచి మొదటి నుంచి అనుకున్న ప్రకారమే చామల కిరణ్‌కుమార్‌రెడ్డికే అధిష్టానం ప్రకటించింది.

అప్పు తీర్చమన్నందుకు హత్య..

- వీడిన పిచ్చమ్మ హత్యకేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండక్రైం : ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని ఆమె దగ్గరే అప్పుతీసుకుని హత్య చేసి బావిలోపడేశారు దుండగులు. ఈ ఘటన ఇటీవల నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ(63)తో అదే గ్రామానికి చెందిన సిలువేరు లక్ష్మయ్య, చంద్రమోహన్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆమె నుంచి లక్ష్మయ్య రూ.1.50లక్షలు, నకిరెకంటి చంద్రమోహన్ రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. వారితో పాటు గ్రామానికి చెందిన నారబోయిన అంజయ్య కూడా రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అంజయ్య ఆమెకు అప్పు తిరిగి ఇచ్చినప్పటికీ ఇవ్వలేదని గ్రామపెద్దల సమక్షంలో ప్రమాణం చేయడంతో అంజయ్య మరలా పిచ్చమ్మకు రూ.40వేలు ఇచ్చాడు. అదే విధంగా పిచ్చమ్మ లక్ష్మయ్యను, చంద్రమోహన్‌ను కూడా డబ్బులు ఇవ్వాలంటూ పదేపదే అడుగుతుండడంతో లక్ష్మయ్య పిచ్చమ్మను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆమెను కలిసే చోటుకు రావాలని రాత్రి 9గంటలకు లక్ష్మయ్య ఫోన్ చేయడంతో సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో లక్ష్మయ్య చంద్రమోహన్, అంజయ్యలకు ఫోన్ చేసి రమ్మన్నాడు. వారు సంఘటనా స్థలానికి వచ్చి డబ్బుల విషయంలో ఎందుకు తమను ఇబ్బంది పెడుతున్నావు. నీతో కలిసే ఉంటున్నాం కదా అంటూ ముగ్గురు కలిసి కర్రతో ఆమె తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం ఆమె మెడలో ఉన్న రెండు వరుసల పుస్తెల తాడు తీసుకున్నారు, అదేవిధంగా కాళ్ల కడియాలు తీసుకునేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో వదిలేశారు. హత్య అనంతరం ఆమెను ఈదుల్కెల్లి గ్రామ శివారులోని నకిరెకంటి అచ్చయ్యకు చెందిన బావిలో పడేశారు. మృతదేహం ఆనవాళ్లు లేకుండా, ఆధారాలు లేకుండా చేశారు.

ఈనెల 21న మిస్సింగ్ కేసు..

ఈనెల 21న నుంచి పిచ్చమ్మ కనపడకపోవడంతో మృతురాలి సోదరుడు పందుల యాదయ్య నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు 24న విచారణ చేపట్టారు. ఆమెకు ఎవరితో సంబంధం ఉందనే వివరాలను ఆరా తీస్తూ ఫోన్ కాల్ డేటాను పరిశీలించారు. చివరి ఫోన్‌కాల్ ఆధారంగా పోలీసులు కూపి లాగడంతో నేరస్తులు ముగ్గురు ఒక దగ్గర రహస్య ప్రాంతంలో ఉండగా అరెస్టు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసిన సీఐ నాగరాజును, ఎస్‌ఐ అంతిరెడ్డి, ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ రాము, మధు, శివ, గిరి, తిరుమలేష్‌ను డీఎస్పీ అభినందించారు. పిచ్చమ్మ గతంలో గ్రామ సర్పంచ్‌గా, ఆమె భర్త ఇస్తారి ఎంపీటీసీగా పనిచేశారు.

ఎక్సైజ్ దాడుల్లో సారా, బెల్లం పట్టివేత



పట్టుబడిన బెల్లం, వాహనంతో నిందితులు, ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్ : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున హుజూర్‌నగర్ ఎక్సైజ్ సిబ్బంది నియోజకవర్గంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మూడు ద్విచక్ర వాహనాలతో పాటు 8 లీటర్ల సారా, 80కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేశారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి దాడులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మేళ్లచెరువు మండలంలోని హేమ్లాతండాకు చెందిన ధరావత్ బాలా తన ద్విచక్రవాహనంపై 8లీటర్ల సారా తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకుని అతడి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా గరిడేపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన పెరబోయిన రాకేష్, కోదాడ మండలం బీక్యాతండాకు చెందిన భూక్య శాంతి సారా తయారీ కోసం హుజూర్‌నగర్ నుంచి 80కిలోల బెల్లం తరలిస్తుండగా ఆమె పట్టుకుని మోటార్ సైకిల్‌ను స్వాదీనం చేసుకున్నారు. వారు ముగ్గురుతో పాటు బెల్లం అమ్మిన నూకల భాస్కర్‌రావుపై కూడా కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు దివ్య, వెన్నెల, గోవర్ధన్, సిబ్బంది రుక్మారెడ్డి, నరేష్, ధనుంజయ్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

రూ.197.87కోట్లకు చేరుకున్న డిపాజిట్లు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ వెంకటబాలసుబ్రహ్మణ్యం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డిపాజిట్లు రూ.197.87కోట్లకు చేరుకున్నట్లు బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై భవనంలో బ్యాంకు 48వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే బ్యాంకు ఆర్థిక పరిస్థితి, వాయిదా మీరిన బాకీలపై నివేదిక చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు రైతులు, వ్యాపారులు, ప్రజలకు రూ.109.71కోట్ల మేర రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ మాట్లాడుతూ.. 9బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన బత్తుల యాదమ్మ, కొండమడుగు శివ, పర్వతం మహేశ్ కుటుంబాలకు మంజూరైన రూ.లక్ష బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్ సూరెపల్లి రమేశ్, డైరెక్టర్లు సీత దామోదర్, భోగ విజయ్‌కుమార్, చిక్క కృష్ణ, పున్న లక్ష్మీనారాయణ, కొండమడుగు ఎల్లస్వామి, కడవేరు కవిత, పిల్లలమర్రి అర్చన, రాపోలు వేణు, బిట్టు భాస్కర్, మాజీ చైర్మన్ కర్నాటి పాండు, టై అండ్‌డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, కర్నాటి బాలరాజు, బ్యాంకు మేనేజర్లు రాచకొండ మధుసూధన్, చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



నరసింహ (ఫైల్)



సుమన్ (ఫైల్)

నల్లగొండక్రైం : ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని కాకుల కొండారం గ్రామానికి చెందిన కుడతాల నరసింహ (42) నల్లగొండ మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నర్సింహ బుధవారం రాత్రి బైక్‌పై భార్య చంద్రకళతో కలిసి తన గ్రామానికి వెళ్తుండగా రాఘవేంద్ర బీఈడీ కళాశాల సమీపంలోకి వెళ్లగానే నల్లగొండకు చెందిన కార్తీక్ తన బైక్‌తో నల్లగొండ వైపు వస్తూ వారు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో నరసింహకు రెండు చోట్ల కాళ్లు విరగ్గా, పొట్ట లోపలికి బైక్ హ్యాండిల్ చొచ్చుకుపోయి తీవ్ర రక్త స్రావం జరిగింది. భార్య చంద్రకళ రోడ్డుపై పడటంతో భుజం విరిగింది. గమనించిన వాహనదారులు గాయపడిన భార్యభర్తలను అంబులెన్స్‌లో నల్లగొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నరసింహ మృతి చెందాడు. భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వనం సుమన్(24) బుధవారం తన ద్విచక్రవాహనంపై పెళ్లికి హాజరై తిరిగి వస్తుండగా రెడ్డినాయక్‌తండా సమీపంలో రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి పెదనాన్న కొడుకు వనం రమేష్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నలుగురికి జైలు

వలిగొండ : ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన నలుగురికి భువనగిరి అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి 3సంవత్సరాల జైలుతో పాటు రూ.500 జరిమానా విధించింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిత్తాపురం గ్రామంలో 2018లో భార్యను కాపురానికి పంపకుండా భార్య తల్లిదండ్రులు, భార్య తమ్ముడు పెడుతున్న వేధింపులను తట్టుకోలేక కారంపూడి ప్రసాద్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో డింగరి శేషాచార్యులు, డింగరి శ్రీదేవి, డింగరి ఫణికుమార్, కారంపూడి రోజను దోషులుగా తేల్చిన న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చిలుకూరు : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని పోలేనిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలు భర్త బత్తిని శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తిని రేణుక (38) రోజు వారిగా ఇంటి పైన ఉన్న ట్యాంకులోకి నీరు నింపేందుకు విద్యుత్ మోటారు ఆన్‌చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి రేణుక అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



అదృశ్యమైన సందీప్

రామగిరి(నల్లగొండ): పెళ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు ఒత్తిడి చేయడంతో ఓ యువకుడు ఇంట్లో నుంచి అదృశ్యమైన సంఘటన తిప్పర్తి మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లికి చెందిన గంటికంపు కృష్ణయ్య కుమారుడు సందీప్(27) పదోతరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం చదువు మానేసి కూలీ పనులు చేస్తూ గ్రామంలో ఉంటున్నాడు. ఈనెల 27న పెళ్లి చేసుకోవాలని తల్లి వెంకటమ్మ సందీప్‌కు సూచించడంతో తనకు పెళ్లి ఇష్టం లేదని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. అనంతరం ఫోన్‌స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సందీప్ సోదరి దర్శనం రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు.

అమ్మనబోలులో యువతి..



దేవరపల్లి పూజిత

నార్కట్‌పల్లి : ఓ యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని అమ్మనబోలు గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట గ్రామానికి చెందిన దేవరపల్లి పూజిత ఈనెల 26న తన అత్తగారి గ్రామమైనా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి కుమారుడితో కలిసి వచ్చింది. తన కుమారుడికి పండ్లు తీసుకువస్తానని చెప్పి కుమారుడిని అత్త మామల వద్ద వదిలి బయటకు వెళ్లింది. ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో బంధువులు, మిత్రులు తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పూజిత భర్త వెంకటరెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

టీటీనగర్ : ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పంచముఖి వెంచర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామానికి చెందిన మిర్యాల నర్సింహ(26) వ్యక్తిగత కారణాలతో వెంచర్‌లో గల విద్యుత్ హైటెన్షన్ టవర్ వద్ద తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

భువనగిరి క్రైం : ఓ మహిళ హత్య కేసులో నిందితుడికి భువనగిరి జిల్లా కోర్టు జడ్జి కే.మారుతీదేవి యావజ్జీవ శిక్ష విధించారు. వివరాల ప్రకారం.. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్‌కు చెందిన చౌడబోయిన లక్ష్మి ఆమె భర్త మరణించడంతో కొంత కాలంగా తన ముగ్గురు పిల్లలతో కూలీ పనిచేస్తూ అక్కడే జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో లక్ష్మికి తన తల్లిగారి గ్రామమైన జనగాం జిల్లా దేవరుప్పల మండలం, ధర్మగడ్డతండా పెద్దముదురు కాలనీకి చెందిన ఆరె కుమార్ వెంకన్నతో పరిచయం ఏర్పడింది. దీంతో కుమార్‌వెంకన్న తరచూ హైదరాబాద్‌లోని లక్ష్మి ఇంటికి వచ్చివెళ్తుండేవాడు. దీంతో వారి ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో లక్ష్మి పలు కారణాలతో అతడిని వదిలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కుమార్ నవంబర్ 11, 2020న లక్ష్మి ఇంటికి వచ్చి నీతోమాట్లాడాలని చెప్పి బయటకు తీసుకెళ్లి భువనగిరి సమీపంలో హైదరాబాద్–వరంగల్ హైవే రోడ్డు పక్కన పొదల్లో గొంతు కోసి హత్య చేశాడు. దీంతో లక్ష్మి ఇంటికి రాకపోవడంతో అదేరోజు రాత్రి కూతురు చౌడబోయిన కీర్తన భువనగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పట్లో పట్టణ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడు ఆరె కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా గురువారం ఒకటో అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కె.మారుతీదేవి అతడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడు ఓసీసీ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు.

చైన్‌స్నాచర్ అరెస్ట్

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఈనెల 24న జరిగిన చైన్‌స్నాచింగ్‌కు సంబంధించిన కేసును పోలీసులు చేధించారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ పుష్పమ్మ(70) తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా అదే సమయంలో ఆన్‌లైన్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేసే మండలంలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన సిలివేరు ప్రవీణ్(30) అక్కడికి వెళ్లాడు. వృద్ధురాలితో మాటామాటా కలిపి మంచినీరు కావాలని అడిగాడు. వృద్ధురాలు ఇంట్లోకి వెళ్తుండగా వెనుక నుంచి వెళ్లి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. వృద్ధురాలు కేకలు వేయగా అదే సమయంలో పక్కింటి మహిళ దాసోజు స్వప్న పట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ తప్పించుకున్నాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలో నిందితుడిని గుర్తించి గురువారం నిందితుడు దేవలమ్మనాగారం గ్రామంలోని తన ఇంటి వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు.

భార్యతో గొడవపడి ఇల్లు వదిలి వెళ్లిన భర్త



అనిల్

రామగిరి(నల్లగొండ): భార్యతో గొడవపడి భర్త ఇల్లు వదిలి వెళ్లిన ఘటన తిప్పర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా వినుకొండ మండలానికి చెందిన కుంట అనిల్(26) ఖమ్మం జిల్లాకు చెందిన పవిత్రతో మూడు సంవత్సరాల క్రితం వివాహం అయింది. 8 నెలలుగా అనిల్ మాడ్గులపల్లి టోల్ ప్లాజా వద్ద మేనేజర్‌గా పని చేస్తూ తిప్పర్తిలో అద్దె గదిలో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 22న అనిల్ ఫోన్‌లో ఉన్న యువతి ఫొటో విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో భార్య పవిత్ర ఫోన్‌తోపాటు తన ఫోన్ కూడా తీసుకుని అనిల్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అనంతరం రెండు ఫోన్లను స్విచ్ ఆఫ్ చేశాడు. గతంలో కూడా ఇలా ఇంట్లో నుంచి వెళ్లి పోవడంతో అనిల్ తల్లిదండ్రులకు పవిత్ర సమాచారం ఇచ్చింది. గురువారం పవిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

యాదాద్రిలో ఐజీపీ రమేష్‌రెడ్డి పూజలు



రమేష్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం ఇస్తున్న ఈఓ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని రాష్ట్ర ఐజీపీ రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆయన కుటుంబ సభ్యులు గర్భాలయంలో స్వయంభూ ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకుని ముఖ మంటపంలో సువర్ణ పుష్పార్చ మూర్తులవద్ద అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారిని దర్శించుకున్న రమేష్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ భాస్కర్‌రావు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.